క్లుప్తంగా

రాజగోపాల్ నగర్ లే ఔట్‌లో నిర్మాణాలు చేపట్టవద్దు

ఐలాపూర్ రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ నేతల డిమాండ్

కవాడిగూడ: సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్ పరిధిలోని రాజగోపాల్ నగర్ లే ఔట్‌లో ఎలాంటి క్రయ విక్రయాలు, నిర్మాణాలు చేపట్టరాదని ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లాడి సందీప్‌కుమార్, కోశాధికారి కె.రమేష్, ఉపాధ్యక్షుడు ఆర్.వి రామమూర్తి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మాధవి డిమాండ్ చేశారు. సదరు లేఔట్‌లోని సర్వే నెంబర్ 119 నుంచి 220 వరకు మొత్తం 408 ఎకరాలపై కోర్టులో కేసు నడుస్తుందన్నారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం అసోసియేషన్ సభ్యులు సేల్ డీడ్ ద్వారా లే ఔట్‌లోని ప్లాట్లను కొనుగోలు చేశారన్నారు. అయితే స్థానిక రాజకీయ నాయకులు అధికారులతో కుమ్మక్కై తప్పుడు పత్రాలు సృష్టించి కొంత భూమిని కబ్జా చేశారని వారు ఆరోపించారు. కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కొందరు నాయకులు సర్వే నెంబర్లు మార్చి తప్పుడు పత్రాలు సృష్టించి తక్కువ ధరకు నోటరీ ద్వారా అమాయకులకు కట్టబెడుతున్నారన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



నారాయణఖేడ్: కప్పు అందుకుంటున్న విన్నర్‌టీం

నారాయణఖేడ్: మండలంలోని లింగాపూర్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్ సౌజన్యంతో కాంగ్రెస్ యువజన గ్రామాధ్యక్షుడు జ్ఞానేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. విజేతగా నిలిచిన చల్లగిద్ద తండా టీంకు రూ.15 వేల నగదు బహుమతితో పాటు కప్పును, రన్నర్‌గా నిలిచిన పీఆర్టీ వారియర్స్ టీంకు రూ.8 వేల నగదు, కప్పును కూడా అందజేశారు. నిర్వాహకులు పృథ్వీరాజ్, సంతోశ్, గణేశ్, దీపక్, ఫకీర్ లతీఫ్, నర్సింలు, చిన్నపండరి పాల్గొన్నారు.

పకడ్బందీగా పరిశీలన



భూములను పరిశీలిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: రైతు భరోసా పథకంలో భాగంగా సాగు భూములను మున్సిపాలిటీ పరిధిలో అధికారులు ఆదివారం పకడ్బందీగా పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్, ఆర్‌ఐ మాధవరెడ్డి, సర్వేయర్ మల్లేశం, జూనియర్ సహాయకులు అనిల్‌రెడ్డి, ఏఈఓ రాందాస్ రైతులతో కలిసి బస్సుడిపో సమీపంలోని వ్యవసాయ భూములు, నిరుపయోగ భూములు, వ్యవసాయానికి పనికిరాని భూములు, కట్టిన కట్టడాలు, భవనాలను రెవెన్యూపటం ఆధారంగా పరిశీలించారు. వ్యవసాయ భూముల్లో భవనాలు కట్టినందున స్వయంగా చూడటంతో పాటు పటం ద్వారా నిర్ధారణ చేసుకొని సాగుకు యోగ్యంగా ఉన్న భూముల వివరాలను నమోదు చేసుకున్నారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నారాయణఖేడ్: మండలంలోని హంగర్గా(బి) గ్రామానికి చెందిన చిరు వ్యాపారి రఫీక్ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఖేడ్ పట్టణ ఎంఐఎం అధ్యక్షుడు మొహిద్‌పటేల్ కోరారు. ఆదివారం ఖేడ్ లోని పార్టీ కార్యాలయంలో సమావేశమై మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని ఆయన హామీనిచ్చారు.

సిద్ధివినాయక ఆలయంలో మహారుద్రం ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభూగా వెలసిన సిద్ధివినాయక ఆలయంలో ఆదివారం మహారుద్రం, శ్రీసూక్త పారాయణం, లక్షమోదక హవన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొగుట పీఠాధిపతి మాదవానంద సరస్వతి సూచనల మేరకు ఆలయంలో మూడు రోజులపాటు మహారుద్రం, ప్రత్యేక పూజలు నిర్వహణకు శ్రీకారం చుట్టారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా శ్రీ మాదవానంద సరస్వతి ఆలయానికి చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపటి నుంచి గ్రామ సభలు

- ఈనెల 24 వరకు..
- నేటితో సర్వే ముగింపు
- సభల్లో రేషన్ కార్డులకు ధరఖాస్తులు

సంగారెడ్డి జోన్: ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగా ఇప్పటికే అర్హులైన వారిని గుర్తించేందుకు సర్వే ప్రక్రియ పూర్తి కావస్తోంది. ఈ నెల 21 నుంచి గ్రామసభలను నిర్వహించే నేపథ్యంలో ఆయా మండలాల్లో గ్రామాల వారీగా సభలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరు అమలు కార్యక్రమం ప్రారంభించనున్న నేపథ్యంలో చేపట్టిన సర్వే ప్రక్రియ నేటితో ముగియనుంది.



సాగు సాగేతర భూముల గుర్తింపు

ప్రభుత్వం సాగు చేసే భూములను మాత్రమే రైతు భరోసా అందించాలని నిర్ణయించి,సర్వే చేపట్టారు. శనివారం వరకు అర్హత గల 7,63,049 ఎకరాల వ్యవసాయ భూమిని, వ్యవసాయ యోగ్యం కాని 4,936 ఎకరాల భూమిని అధికారులు గుర్తించారు. రేషన్ కార్డు కోసం వచ్చిన ధరఖాస్తులలో 26,158 కుగాను 22,792 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. జిల్లాలో రేషన్ కార్డుల సర్వే 87% పూర్తయ్యింది. జిల్లాలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ 2023–24లో 20 రోజుల పని దినాలు పూర్తిచేసిన 25 వేల మంది కూలీలను గుర్తించి, బ్యాంకు ఖాతాలు లేని వారి వివరాలు సేకరించి, అప్‌డేట్ చేస్తున్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 100% పూర్తయింది. సూపర్ చెక్ సర్వే కొనసాగుతోంది. ఈ నెల 21 నుంచి 24 వరకు జిల్లాలోని వివిధ గ్రామాల్లో సంబంధిత పంచాయతీ కార్యదర్శులతోపాటు అన్ని శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు హాజరుకానున్నారు. అధికారులు సేకరించిన వివరాలను సభల్లో చదివి, వినిపిస్తారు. ఏమైనా ఫిర్యాదులు, అభ్యంతరాలుంటే సభ దృష్టికి తీసుకురావచ్చు. అదేవిధంగా అర్హులైన వారి నుంచి రేషన్‌కార్డు కోసం గ్రామ సభలలో దరఖాస్తులు స్వీకరించనున్నారు.

మహనీయుడు పండగ సాయన్న

పటాన్‌చెరు టౌన్: రజాకార్లు, భూ స్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేదల కడుపునింపిన పోరాట యోధుడు పండగ సాయన్న అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్‌లో సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పేదలు ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడని అన్నారు. ముదిరాజ్ కులంలో పుట్టి బందూక్ ఎత్తి రజాకార్ల అన్యాయాలను ఎదిరించి బహుజనులకు అండగా నిలిచాడని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత నీలం మధు

‘డిజిటల్ అరెస్టులు పోలీసులు చేయరు’

ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే: డీఎస్పీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డిజిటల్ అరెస్టులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, పోలీసులు ఎవరూ కూడా ఈవిధంగా అరెస్టులు చేయరని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీలు హరికృష్ణ, కేవీఎం ప్రసాద్, సూర్యప్రకాశ్, జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డిలు చెప్పారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజుపుష్ప క్లబ్ హౌస్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీపీ శిఖా గోయల్ ఆదేశాల మేరకు ఆదివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ అరెస్ట్‌లపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని తెలిపారు. అందరూ డిజిటల్ అరెస్టులపై ఫోన్‌కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాను అదునుగా చేసుకుని సైబర్ నేరగాళ్లు యువత, సీనియర్ సిటిజన్‌లు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారిని టార్గెట్ చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టకూడదని సూచించారు. అదే విధంగా అపరిచిత వ్యక్తులు పెట్టిన పోస్టులను నమ్మకూడదని స్పష్టం చేశారు. ఏదైనా సైబర్‌క్రైమ్ జరిగితే వెంటనే 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్‌క్రైమ్ జరిగిన గంట వ్యవధిలో గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేసినట్లయితే నగదు సీజ్ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ, సభ్యులు మదన్మోహన్, వేణుగోపాల్ రెడ్డి, బద్రీనాథ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన

పటాన్‌చెరు: ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అమీన్‌పూర్ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు సాయి అంబికా కాలనీలో రూ.కోటి అంచనాతో నిర్మించిన పంచతత్వ పార్కును స్థానిక మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం 16వ వార్డు పరిధిలోని నర్రెగూడెం ఇండస్ వ్యాలీ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 35 వ మైత్రి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. నేటి యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రికెట్ అభివృద్ధికి మైత్రి క్రికెట్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రెండేళ్ల క్రితం రూ.7.50 కోట్లతో ఆధునిక వసతులతో మైదానాన్ని తీర్చిదిద్దామని తెలిపారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం పటాన్‌చెరు శాఖ, బండారు హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, కమిషనర్ జ్యోతి రెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత రెడ్డి, పారిశ్రామికవేత్త కె.సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రామ్మోహన్ గుప్తా, ప్రముఖ వైద్యులు డాక్టర్ సుశ్రుత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ వరం

జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ వెంకటస్వామి



జోగిపేటలో ఓపెన్ స్కూల్‌లో మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్

జోగిపేట(అందోల్): చదువు మానేసిన, దూరమైన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరమని సంగారెడ్డి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామి పేర్కొన్నారు. జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ...ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఓపెన్ స్కూల్‌లో చేరడం సువర్ణ అవకాశంలాంటిదన్నారు. ప్రతీ ఒక్కరు దీనిని ఉపయోగించుకుని సమాజంలో ఉన్నతస్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కో ఆర్డినేటర్ విఠల్, అధ్యాపకులు శ్రీనివాస్, యాదు, ఖదీర్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

కల్హేర్(నారాయణఖేడ్): మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం సిర్గాపూర్ మండల కేంద్రంలో శివాజీ చౌక్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన డాక్యుమెంట్స్ లేకపోవడంతో వాహనాలు సీజ్ చేసి, ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనం నడిపితే తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని సూచించారు. హెల్మెట్ ధరించాలని, ఇన్సురెన్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పూర్తిగా ఉండాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు.

బైకు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

కల్హేర్(నారాయణఖేడ్): బైకు అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం సిర్గాపూర్ మండలం వంగ్దల్ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. వాసర్ గ్రామానికి చెందిన చంద్రకాంత్, శంకర్ బైకుపై నారాయణఖేడ్ నుంచి వాసర్ వెళ్తుండగా వంగ్దల్ చౌరస్తా వద్ద బైక్ అదుపు తప్పి పడ్డారు. దీంతో ఇద్దరికి గాయాలు కాగా స్థానికులు సమాచారం మేరకు 108 సిబ్బంది చేరుకున్నారు. ఇందులో క్షతగాత్రులను ఖేడ్ ఆస్పత్రికి తరలించారు.

గ్యాస్ పైప్‌లైన్ వద్దంటూ పాదయాత్ర

జహీరాబాద్: గ్రామంలో గ్యాస్ పైప్‌లైన్ వేయవద్దంటూ మదిరి గ్రామ యువకులు చలో రాజ్‌భవన్ పాదయాత్ర చేపట్టారు. ఆదివారం కోహీర్ మండలంలోని మదిరి నుంచి జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు పాదయాత్ర చేపట్టారు. గ్రామ ప్రజల అనుమతి లేకుండా పైప్‌లైన్ ఏర్పాటు చేయడం తగదన్నారు. ప్రైవేటు సంస్థ చేపడుతున్న గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణం పనులు వెంటనే నిలిపివేయాలని కోరుతూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఐదేళ్లుగా చేస్తున్న ఆందోళనకు ప్రభుత్వం స్పందించనందునే రాజ్‌భవన్‌కు పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్మాణం పనులు నిలిపివేయించాలని వారు కోరారు. యాత్రలో గ్రామ యువకులు జి.పవన్‌కుమార్, ఎం.భానుప్రసాద్, ఎస్.మోష, డి.రామ్‌రాజ్, ఎన్.అనిల్, ఎస్.చంటి, ఎం.చింటు, బి.చిన్న, ఎన్.ఏసులు పాల్గొన్నారు. పాదయాత్రకు గ్రామ ప్రజలు మద్దతు తెలిపారు.



పాదయాత్ర చేపట్టిన మదిరి గ్రామ యువకులు

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ...రైతు భరోసా కింద ఎకరాకు యేటా రూ.15 వేలు ఇస్తామని హామీనిచ్చి ఓ విడత ఎగ్గొట్టడమే కాకుండా రూ.12 వేలు మాత్రమే ఇస్తామనడం రైతులను మోసగించడమేనన్నారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఖేడ్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించిన హంగిర్గా(బి) గ్రామానికి చెందిన రఫీక్ కుటుంబాన్ని భూపాల్‌రెడ్డి పరామర్శించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్ విఠల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పకడ్బందీగా సర్వే చేపట్టాలి

ఆర్‌డీఓ రాంరెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): రేషన్ కార్డులు, రైతు భరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డీఓ రాంరెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో నిర్వహిస్తున్న రేషన్ కార్డులు, రైతు భరోసాకు సంబంధించి సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు సర్వేను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రేషన్ కార్డులకు సంబంధించి ఎక్కడా పొరపాట్లు లేకుండా అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ భూపాల్‌తో పాటు రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.



రేజింతల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

బీసీ కులాలన్నీ ఏకం కావాలి

జహీరాబాద్: బీసీ కులాలన్నీ ఐకమత్యంతో ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయా కుల సంఘాల నాయకులు కోరారు. ఆదివారం జహీరాబాద్‌లో నిర్వహించిన కుల సంఘాల సమావేశంలో మాజీ ఎంపీపీ జి.విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఎం.జీ.రాములు యాదవ్, జి.భాస్కర్‌యాదవ్‌లు మాట్లాడారు. బీసీలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అవకాశం ఉన్న చోటల్లా బీసీలు పోటీ చేయాలని, జనరల్ స్థానాల్లో సైతం పోటీ చేయాలన్నారు. బీసీలు పోటీ చేసే చోట వారినే గెలిపించుకోవాలన్నారు. కుల గణన చేసిన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఆయా కుల సంఘాల నాయకులు శంకర్, గడ్డం జనార్ధన్, సంగప్ప, పండాల్ జ్యోతి, ప్రభు, సందీప్, దత్తాత్రి, రమేష్‌బాబు, దుర్గయ్య, పెద్దగొల్ల నారాయణ, విఠల్‌గౌడ్, విశ్వనాథ్, అశోక్, భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకుడు



ఆత్మీయ సమ్మేళనం

జోగిపేట.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

– జోగిపేట(అందోల్)

సంక్షిప్త వార్తలు

◆ పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో తహసీల్దార్ శివశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం సాగుకు యోగ్యం కాని భూములు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మల్లేశం, ఎఈఓలు సంతోష, కృష్ణవేణి, సిబ్బంది రవి, రాజు, లక్ష్మణ్, దేవిడ్, సురేశ్ పాల్గొన్నారు.

◆ ఉచిత నేత్ర వైద్య శిబిరం

నారాయణఖేడ్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవన్‌లో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాంత రిటైర్డ్ ఉద్యోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. 50 మందికి కంటి పరీక్షలు చేయగా, 16 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సంఘం బాధ్యులు నర్సింలు, వీరయ్య, మైనొద్దీన్ పాల్గొన్నారు.

◆ నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహాశివరాత్రి మండల పూజల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో శివ స్వాములకు ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ అర్చకులు వెల్లడించారు.

◆ ‘ఒకేసారి వేతనాలు చెల్లించాలి’

నారాయణఖేడ్: మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు, బిల్ కలెక్టర్లకు, నీటి సరఫరా విభాగం సిబ్బందికి, అటెండర్లకు ఒకేసారి వేతనాలు చెల్లించాలని ఆదివారం ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. కొందరికి ఒకసారి, మరికొందరికి మరోసారి చెల్లిస్తున్నారని ఇది సరికాదన్నారు.

◆ అధ్యక్షుడిగా శంకర్



జహీరాబాద్ టౌన్: ది గ్రీన్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శంకర్‌పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సుభాష్ గంజ్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా డి.ఈశ్వర్, భగవాన్ శివాజీ జవార్, మోహన్‌రెడ్డి, పసారి రమేష్ బాబు, రవి ధనసిరి, విజయ్‌కుమార్, చిద్రి రమేష్, మాణిక్యం, నీల సంగమేశ్వర్, ఓం పల్లోడ్‌లు ఎన్నికయ్యారు.

◆ రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్

మునిపల్లి(అందోల్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సాయికుమార్ ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ క్యాంపు కార్యాలయంలో ఆయా గ్రామాల మాజీ నాయకులతో కలిసి ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై వ్యవహరిస్తున్న తీరు, ప్రజా సంక్షేమ పథకాల మంజూరులో అలసత్వంపై మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, శశికుమార్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

◆ పథకాలు అందేలా కృషి చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో నాయకులు అనసూజ, సాదిక్, అలీ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

మునిపల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను ఎంపీడీఓ హరినందన్‌రావు ఆదివారం పరిశీలించారు. మండలంలోని లింగంపల్లి, బుదేరా, పెద్దచల్మెడ గ్రామాల్లో స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ చెక్కుల పంపిణీ



సంగారెడ్డి జోన్: నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పంపిణీ చేశారు. ఆదివారం సంగారెడ్డిలో 87 మంది లబ్ధిదారులకు సుమారు రూ.50 లక్షల చెక్కుల పంపిణీ చేయడం చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట మండల అధ్యక్షులు సిద్దన్న, యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణగౌడ్, శ్రీకాంత్ గౌడ్, మండల నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మునిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆదివారం జహీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి 14 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ 12 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

◆ పండరిపూర్‌కు పాదయాత్ర

మునిపల్లి(అందోల్): మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానం పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ ఆధ్వర్యంలో భజన మండలి భక్తుల పాదయాత్ర మూడో రోజు బసవ కల్యాణ్‌కు ఆదివారం చేరుకుంది. 11 రోజుల పాటు ఈ పాదయాత్ర కొనసాగుతుందని పీఠాధిపతి తెలిపారు. కార్యక్రమంలో అంతారం గ్రామ భజన మండలి భక్తులు పాల్గొన్నారు.

◆ కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ వీరశైవ శాకి మఠం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ఆదివారం బసవ సేవా సదన్ ఫంక్షన్ హాలులో షటస్థల బ్రహ్మ 108 శివయోగి శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా మల్లన్న, కార్యదర్శిగా విశ్వనాథం, కోశాధికారిగా వీరేశం, గౌరవ అధ్యక్షుడిగా శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, బస్వరాజ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.